క్లుప్తంగా

క్రీడాభివృద్ధికి నిధులు మంజూరు



క్రీడామైదానంలో జేసీబీతో చేస్తున్న పనులు

ఐరాల: పీఎం శ్రీ పథకం కింద స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాభివృద్ధికి నిధులు మంజూరైనట్లు సోమవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద పాఠశాలకు క్రీడా మైదానం అభివృద్ధి పనులు, క్రీడల్లో ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని రకాల క్రీడా సామగ్రిని అందించనుందని తెలిపారు. రూ.5 లక్షలు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తారన్నారు. ఈక్రమంలో క్రీడా మైదానం అభివృద్ధి పనులకు రూ.లక్ష మంజూరైనట్లు ఆమె పేర్కొన్నారు.

సహజ వ్యవసాయ ప్రాధాన్యతను తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

బంగారుపాళెం: భావితరం సహజ వ్యవసాయ ప్రాధాన్యతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆదర్శరైతు జగదీష్‌రెడ్డి తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో సోమవారం ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తర్వాత తరం వ్యవసాయం, సేంద్రియ, సహజ వ్యవసాయ మార్గాలు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారన్నారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు జాతీయ సదస్సులో పాల్గొని సహజ వ్యవసాయ పద్ధతులు వల్ల ప్రజలకు కలిగే మేలు గురించి వివరించినట్లు చెప్పారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

బంగారుపాళెం: మండలంలోని ఎస్‌హెచ్‌జీలకు మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కులను అందజేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సాయంత్రం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొననున్నట్లు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. సోమవారం దిగువ మోదలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశా కార్యకర్తలు సౌందర్య, నాగభూషణ, పుష్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం రేపు

ఐరాల: వైఎస్సార్‌సీపీ మండల ఆత్మీయ సమావేశాన్ని తవణంపల్లె మండలం క్రాస్ రోడ్డులోని నారాయణాద్రి కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ హాజరవుతారని చెప్పారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరుకావాలని తెలిపారు.

'స్పందన'లో ఆరు వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న సహాయ కమిషనర్ గోవర్ధన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు అందినట్లు నగర కమిషనర్ జె అరుణ తెలిపారు. సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మెప్మా:2, ప్రజారోగ్య విభాగం:3, ఇంజినీరింగ్:1 చొప్పున వినతులు అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, డీఈ రమణ, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో సంకటహర చతుర్థశి

పలమనేరు: పట్టణంలోని బసవేశ్వర ఆలయంలో సంకటహర చతుర్థశిని సోమవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించడానికి అందరూ సిద్ధం

- చిత్తూరులో ప్రారంభమైన ఎన్నికల ప్రచారం



ఆలయంలో పూజలు చేస్తున్న విజయానందరెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: "అవ్వా, తాతా బాగున్నారా? అమ్మా!..మీకు పింఛను వస్తోందా? అక్కా... మీకు అమ్మఒడి పడుతోందా? బాబూ జగనన్న విద్యాదీవెన మీకు అందుతోందా?.. సమస్యలు ఏమైనా ఉన్నాయా?'' అంటూ వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. సోమవారం ఆయన చిత్తూరులోని మురకంబట్టు అగ్రహారం పడవేటమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసి, అన్ని వర్గాలకు మేలు చేస్తోందన్నారు. ప్రభుత్వం చేసిన మేలును తెలుపుతూ ధైర్యంగా ప్రజల్లోకి వచ్చి ఓట్లు అడుగుతున్నామన్నారు. కానీ ఇది గిట్టని ప్రతిపక్షం నిత్యం అసత్యప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వారు ఎన్ని కుట్రలు పన్నినా, ఎంతమందితో జతకట్టినా ప్రజలందరూ జగనన్న వెనుక ఉంటారని, జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కనిపించే నాయకులను నమ్మరాదన్నారు. నిరంతరం ప్రజల నడుమే ఉంటూ, సమస్యలపై స్పందించే వారినే ఎన్నుకోవాలని, రానున్న ఎన్నికల్లో చిత్తూరును భారీ మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. జగనన్న స్ఫూర్తితో తన వంతుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు టిమ్ము, కార్పొరేటర్ శ్రీకాంత్, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్ నాయకులు ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జలంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు కార్పొరేషన్: శుద్ధ జలం తీసుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ పేర్కొన్నారు. సోమవారం చిత్తూరులో పర్యావరణం, రక్షిత మంచినీరు అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లెల్లో ప్రజలకు సరఫరా చేసే నీటిని పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాన్నారు. ఎక్కడైనా ట్యాంకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలన్నారున. తాగు నీటి బోర్లు ఉన్న ప్రాంతాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయకుమార్, ఇంజినీర్లు, అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పూతలపట్టు: పూతలపట్టు వేదికగా నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ముగింపు సమావేశాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. చివరిరోజైన సోమవారం మహిళలకు వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానంలో బంగారుపాళ్యం, రెండవ స్థానం పూతలపట్టు, మూడవ స్థానంలో యాదమరి జట్లు నిలిచాయి. క్రికెట్ మ్యాచ్‌లో విజేతగా పూతలపట్టు నిలిచింది. ద్వితీయస్థానంలో యాదమరి, మూడవస్థానంలో ఐరాల జట్లు నిలిచాయి. గెలుపొందిన జట్లకు ప్రజా ప్రతినిధులచే ట్రోఫీలను అందజేశారు. ఎంపీడీఓ గౌరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మాసిలామణి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, నేత జగదీశ్వర్‌రెడ్డి, పీడీలు కృష్ణ, డిల్లీరాణి, ఏకాంత, ఏఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన దిగుబడులు



సేంద్రియ వ్యవసాయ జాతీయ సెమినార్‌లో జ్ఞాపికను అందుకుంటున్న జగదీశ్వర్‌రెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయ విధానంతోనే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ రైతు వై.జగదీశ్వర్‌రెడ్డి చాటి చెప్పారు. సోమవారం మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో బావితరాలకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. జిల్లా తరఫున బంగారుపాళ్యం మండలానికి చెందిన ఆయన పాల్గొని ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత దేశానికి ఎంత అవసరమో చాటిచెప్పారు. సేంద్రియ వ్యవసాయం చేస్తే గణనీయంగా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, ఈ విధానంతో సాగు చేసిన ఆహారపంటలు ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. సెమినార్ నిర్వాహకులు ఆయనకు జ్ఞాపిక అందజేశారు.

జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లోనూ సత్తా చాటండి



వాలీబాల్ విన్నర్స్‌కు కప్, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ, కమిషనర్

- 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాకారులకు పిలుపు
- నియోజకవర్గ స్థాయి పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలలో మరుగునపడిన క్రీడా మాణిక్యాలను ఆడుదాం ఆంధ్రాతో వెలుగులోకి తెచ్చామని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, మెడల్స్, సర్టిఫికెట్లను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ సీతారామన్, ఎంపీడీఓ నారాయణతో కలసి ఆయన బహుమతులు అందజేశారు. పుంగనూరు వాలీబాల్ జట్టుకు మెడల్స్ వేసి, షీల్డ్ అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ సుమారు నెల పాటు క్రీడాపోటీలను ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించారన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖో–ఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో ఎందరో గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారని ప్రశంసించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఇలాగే రాణించి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకుడు జయరామిరెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే!

పుంగనూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారి వివరాలను పీడీ మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. వాలీబాల్ పురుషుల విభాగంలో విన్నర్స్, రన్నర్స్‌గా పుంగనూరు, రొంపిచెర్ల, మూడవ స్థానంలో సదుం నిలిచాయి. మహిళల విభాగంలో రొంపిచెర్ల, పుంగనూరు, చౌడేపల్లె ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో పుంగనూరు, చౌడేపల్లె విన్నర్స్, రన్నర్స్‌గా నిలవగా, సోమల తృతీయ స్థానంలో నిలిచింది. అలాగే మహిళ విభాగంలో సదుం, పుంగనూరు, పులిచెర్ల, ఖోఖో మహిళ విభాగంలో పుంగనూరు, రొంపిచెర్ల, చౌడేపల్లె, పురుషుల విభాగంలో చౌడేపల్లె, సదుం, పుంగనూరు, బ్యాడ్మింటన్‌లో పుంగనూరు, సదుం, సోమల, మహిళల విభాగంలో పులిచెర్ల, చౌడేపల్లె, రొంపిచెర్ల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలయ్యాయి. ఇక క్రికెట్ బాలికల విభాగంలో రొంపిచెర్ల, పుంగనూరు విన్నర్స్, రన్నర్స్‌గా నిలవగా, పురుషుల విభాగంలో రొంపిచెర్ల, పులిచెర్ల, సోమల మండలాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచాయి.

వినాయకుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



జయలక్ష్మికి స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం ఆమె స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఆలయ అధికారులకు అందజేశారు. సోమవారం దాత స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా కాణిపాకం విచ్చేసి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. దాత, కుటుంబసభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా శారద



శారద

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా వి.శారద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎర్రగుంటలో టీపీఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికొచ్చారు. నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ గోవర్ధన్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

'విద్యుత్' ఫిర్యాదులు ఉంటే తెలపండి

చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపు విషయంలో ఫిర్యాదులు ఉంటే వినియోగదారులు తెలపాలని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి కోరారు. సోమవారం రూరల్ ఈఈ కార్యాలయంలో ఏపీ ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించింది. రాష్ట్ర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి అభ్యంతరాలున్నా తెలియజేయవచ్చన్నారు. పెరుగుతున్న వ్యయం, బిల్లుల పెంపు ఆవశ్యకతపై ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు చెప్పారు. రూరల్ ఈఈ కార్యాలయంలో ప్రజలు అభిప్రాయాలు, అభ్యంతరాలు, ఇతరత్రా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఆర్డీఓ సమీక్ష

- క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

చిత్తూరు అర్బన్: పోలింగ్ బూత్ స్థాయిలో తుది ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, పొరపాట్లు ఉంటే క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నియోజకవర్గంలోని బీఎల్వోలు, సూపర్‌వైజర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్వో మాట్లాడుతూ.. ఇటీవల ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ఉన్నా, పోలింగ్ బూత్ నంబర్లు మారినా, ఫొటోలు సక్రమంగా లేకపోయినా, డబుల్ ఎంట్రీలు, జంక్ ఓటర్లను గుర్తించి సత్వరం నివేదిక ఇవ్వాలన్నారు. గుర్తించిన పొరబాట్లను నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తిచేయాలన్నారు. జాబితాలో మార్పులు–చేర్పులకు అవకాశం ఉన్న నేపథ్యంలో దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

వందశాతం కులగణన సర్వే పూర్తిచేయాలి

నగరపాలక పరిధిలో కులగణన సర్వే వంద శాతం పూర్తిచేయాలని సహాయ కమిషనర్ గోవర్ధన్ ఆదేశించారు. కులగణన, పేదలందరికీ ఇళ్లు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, టాక్స్ వసూళ్లపై అడ్మిన్ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలో కులగణన సర్వేతోపాటు పన్నుల వసూలు వేగవంతం చేయాలని, దీర్ఘకాలంగా ఉన్న బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సీఎంఎం గోపి, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రత ముఖ్యం

- హెల్త్ క్యాంపులో డీటీసీ నిరంజన్‌రెడ్డి



హెల్త్ క్యాంపులో వైద్యులు, అధికారులు

చిత్తూరు రూరల్: వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రత పాటించడంతో పాటు ఆరోగ్య భద్రత కూడా ముఖ్యమని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సోమవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. పలు వాహన డ్రైవర్లు, శాఖ అధికారులు, సిబ్బందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు, మాత్రలు ఉచితంగా అందజేశారు. 250 మంది ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురైతే ఆ కుటుంబ పరిస్థితి దారుణమని కొన్ని సంఘటనలు ఉదహరించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడిపేటప్పుడు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను నిబంధనలు ఉల్లంఘించరాదని, ఉల్లంఘిస్తే తదుపరి పరిణామాలకు వాహన యజమానియే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భారీ వాహనాల డ్రైవర్లు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, మురళి, దీపిక, శ్వేత, భాగ్యశ్రీ, ప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరీక్షా పే చర్చ

- ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన విద్యార్థులు



గిరింపేట మున్సిపల్ స్కూల్‌లో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న హెచ్‌ఎం తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో సోమవారం పరీక్షా పే చర్చా ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు వీక్షించారు. ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులను ఉద్దేశించి పరీక్షా పే చర్చా కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని సమాధానమిచ్చారు. పరీక్షల సమయంలో ఒత్తిడి ఎలా అధిగమించాలి? ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలి? సోషల్ మీడియా, సెల్‌ఫోన్ల ప్రభావం..అనే అంశాలపై ప్రధాని మాట్లాడారు. చిత్తూరు గిరింపేట మున్సిపల్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, బీజేపీ నాయకులు చిట్టిబాబు, పాండియన్, రెడ్డిమస్తాన్, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

యాదమరి మండల ఉపాధ్యాయులకు పదవులు



మదనమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం పిళ్లై, రంగనాథం, గణపతి

యాదమరి: చిత్తూరు పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఎన్నికల్లో యాదమరి మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పదవులు వరించాయి. ఉదయం నిర్వహించిన ఈ ఎన్నికలకు మాజీ ఎంఎల్‌సీ కత్తినరసింహారెడ్డి, అసోషియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ హాజరయ్యారు. జిల్లా స్థాయిలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో యాదమరి మండలంలోని ఉపాధ్యాయుడు మదనమోహన్‌రెడ్డిని జిల్లాశాఖ అధ్యక్షుడు, రాష్ట్ర కౌన్సిలర్‌గా సుబ్రమణ్యం పిళ్లై, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంగనాథం, గణపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎస్టీయూ ఉపాధ్యాయుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం



విలేజ్ క్లినిక్ ముందు వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 'డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్'లు ఏర్పాటు చేస్తున్నట్లు నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్స్ టీమ్ వైద్యాధికారులు శ్రీనాథ్‌రెడ్డి, రాజేశ్వర్, ఢిల్లీ, నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నెల్లిపట్లలో సోమవారం విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించి వారు మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.23 కోట్లతో శివాలయ రాజగోపుర నిర్మాణం



మాట్లాడుతున్న ఆలయ ఈఓ కమలాకర్, పక్కన చైర్మన్

పలమనేరు: పట్టణంలోని శివాలయ రాజగోపుర నిర్మాణానికి దేవదాయశాఖ రూ.1.23 కోట్లను మంజూరు చేసినట్టు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు. ఆలయ కమిటీతో కలసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చారిత్రక ప్రసిద్ధి కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఆలయ కమిటీ చైర్మన్ గంటే వీరభద్ర స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. దీంతో దేవదాయశాఖ ఆలయ రాజగోపురం, పుష్కరిణి, ఇతర నిర్మాణాల కోసం రూ.1.23 కోట్లను కేటాయించిందని, ఇందులో మ్యాచింగ్ గ్రాంటుగా రూ.25లక్షలు ఉంటుందని చెప్పారు. ఆలయ చైర్మన్ గంటే వీరభద్ర తన వంతుగా రూ.5లక్షల చెక్కును ఈఓకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని భక్తులు, దాతల సాయంతో చెల్లించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



పూతలపట్టు: ఆన్‌లైన్‌లో సైట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

పూతలపట్టు: పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఇందులో భాగం పూతలపట్టు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. 'నవరత్నాల పేదలకు ఇళ్లు' వెబ్‌సైట్‌ను పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ సర్వర్ రాగానే మండలంలో పేదలకు ఇచ్చిన పట్టాలను తప్పకుండా సచివాలయాల సిబ్బందితో కలిసి రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. పేదకలు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి వారికి ఆస్తిగా అందించాలనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకు బాబురెడ్డి, నేతలు జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో జేసీ తనిఖీ

చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం జేసీ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంతో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాల కార్యక్రమం అమలు తీరుపై ఆరాతీశారు. ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ మురళి, డీటీలు కిరణ్, ధనంజయ్య పట్టాల మంజూరు గురించి జేసీకి వివరించారు. చిత్తూరు అర్బన్‌లో 3,283 మంది పట్టాలకు సంబంధించిన అన్ని వివరాలను అప్లోడ్ చేసినట్లు ఆయన తెలియజేశారు. జేసీ మాట్లాడుతూ, ఇంకనూ పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను వెంటనే సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు.